BHARATH SAMACHAR DIGITAL

30, మార్చి 2026, సోమవారం భారత్ సమాచార్

క్రికెట్ బెట్టింగ్‌లతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు: ఎస్పీ



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో క్రికెట్ బెట్టింగ్‌ల మోజులో పడి యువత తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు హితవు పలికారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. బెట్టింగ్‌ల వల్ల ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, మనస్తాపంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల మొబైల్ ఫోన్ వినియోగం, ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలో అక్రమ బెట్టింగ్‌లను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ మరియు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే డయల్ 100 లేదా జిల్లా కంట్రోల్ రూమ్ (8712657888)కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ స్పష్టం చేశారు.

© 2026 Bharath Samachar